రెండు నెలలుగా కుర్చీ ఖాళీ





ఎంపీడీఓ చాంబర్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీ, ఉదయం 11 గంటలు దాటినా సిబ్బంది హాజరు కాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

- రెగ్యులర్ ఎంపీడీఓ లేక ప్రజల అవస్థలు
- సక్రమంగా విధులకు హాజరుకాని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ
- ఉదయం 11 దాటినా హాజరు కాని సిబ్బంది

గుంతకల్లు రూరల్: రెగ్యులర్ ఎంపీడీఓ లేక సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయ అధికారులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రెండు నెలలుగా ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఆధ్వర్యంలోనే మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ నిర్వహణ కొనసాగుతుంది. ఈఓఆర్డీ బాధ్యతలతో పాటు ఎంపీడీఓ బాధ్యతలు కూడా చూసుకోవాల్సి రావడంతో పని ఒత్తిడి, ఇతర కారణాలతో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కార్యాలయానికి సక్రమంగా హాజరుకావడం లేదు. దీంతో ప్రశ్నించేవారు లేక కిందిస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఉదయం 11 గంటలు దాటినా కార్యాలయానికి ఉద్యోగులు హాజరు కాకపోవడం, ఆలస్యంగా వచ్చినా కొద్దిసేపటికే తిరిగి వెళ్లిపోతుండటంతో కార్యాలయ వాతావరణం సెలవు దినాలను తలపిస్తోంది. దీంతో వివిధ రకాల పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు సమస్యలు ఎవరితో చెప్పుకోవాలో దిక్కుతోచక వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. గుంతకల్లు మండల ఎంపీడీఓగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీకాంత్ చౌదరి రెండు నెలల క్రితం పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఈఓఆర్డీ నాగభూషణంకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాధ్యతలు అప్పజెప్పారు. సాధారణంగా ఎంపీడీఓ బదిలీపై వెళ్లినా లేక పదవీ విరమణ పొందినా వెంటనే ఆ స్థానంలో మరొకరి నియామకం చేపట్టాల్సి ఉంటుంది. కానీ గుంతకల్లు మండలంలో మాత్రం రాజకీయ జోక్యం కారణంగా రెండు నెలలుగా రెగ్యులర్ ఎంపీడీఓ నియామకం జరుగనే లేదు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న ఈఓఆర్డీ నాగభూషణం క్షేత్ర స్థాయి పర్యటనల్లో భాగంగా తరచూ గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తుండటంతో కార్యాలయంలో ఆయన కనిపించడమే కరువైంది. దీంతో ఎప్పుడు చూసినా ఎంపీడీఓ చాంబర్‌లో ఖాళీ కుర్చీనే దర్శనమిస్తుంది. ఉన్నతాధికారి పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితిని అలుసుగా తీసుకున్న కింది స్థాయి ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరవడం మానేశారు. ఉదయం 11 దాటినా కార్యాలయానికి రాకపోవడం, వచ్చినా కొద్దిసేపటికే తిరిగి వెళ్లిపోవడం లాంటివి షరామామూలయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ ఎంపీడీఓ నియామకం చేపట్టాలని మండలవాసులు కోరారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

పామిడి: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జెడ్పీ సీఈఓ శివశంకర్ హెచ్చరించారు. మండలంలోని నీలూరు గ్రామాన్ని గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య పనులపై ప్రజలతో సమీక్షించారు. రోజు ఉదయం 7 గంటలకే ఇంటింటికి వెళ్లి పొడి, తడి చెత్తలను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రంలో వేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. అలాగే సకాలంలో వాటర్ ట్యాంకులను శుభ్రపర్చాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అలాగే గ్రామంలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రం నిర్వహణపై సిబ్బందితో సమీక్షించారు. ఆయన వెంట ఎంపీడీఓ కే తేజోత్స్న, ఈఓఆర్డీ సీ అశ్వర్ధనాయుడు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



నీలూరులో చెత్తతో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

నిధుల దుర్వినియోగంపై విచారణ

యాడికి: మండల కేంద్రంలోని పంచాయతీలో నిధులు దుర్వినియోగంపై గురువారం ఎంపీడీఓ వీర్రాజు యాడికి పంచాయతీ కార్యాలయంలో సర్పంచు అనురాధ, గతంలో ఈఓగా విధులు నిర్వహించిన అశ్వర్ధనాయుడు, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్రతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గతంలో పంచాయతీకి సంబంధించి నిధులను దుర్వినియోగం చేశారనే ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ నివేదికలు ఇవ్వాలన్నారు. గతంలో ఉన్న పంచాయతీ ఎం.రికార్డులను కొన్ని మాత్రమే ఇచ్చి.. మిగిలినవి కాంట్రాక్టర్ వద్ద ఉన్నాయని వాటిని రెండు రోజుల్లో అందజేస్తానని జూనియర్ అసిస్టెంట్ లక్ష్మేంద్ర తెలిపారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ శశికళ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ వీర్రాజు

క్లుప్తంగా

వైఎస్ జగన్‌కు రాఖీ



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాఖీ కడుతున్న నైరుతిరెడ్డి

గుంతకల్లుటౌన్: మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి రాఖీ కట్టారు. గురువారం అనంతపురంలో జరిగిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్ రెడ్డి- సాయి రోహిత వివాహానికి హాజరైన జగన్‌కు ఆమె రాఖీ కట్టి ఆశీర్వాదం పొందారు.

వైవీఆర్ పరామర్శ



మైనార్టీ నాయకుడిని పరామర్శిస్తున్న వైవీఆర్

గుంతకల్లుటౌన్: మూడురోజుల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు నూర్‌నిజామిని గురువారం గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరామర్శించారు. అతడికి మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు సూచించారు. వైవీఆర్‌తో పార్టీ నాయకుడు కాకర్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

తాడిపత్రిలో మాజీ డిప్యూటీ సీఎం



అంజాద్‌బాషాతో ఫయాజ్‌బాషా

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ముచ్చటించారు. అలాగే పట్టణంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు ఫయాజ్‌భాషా ఇంటికి వెళ్లి, ఆయనతో తాడిపత్రి రాజకీయ పరిస్థితిపై ఆరా తీశారు. అనంతపురంలో జరిగిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి కుమారుడు ప్రణయ్‌రెడ్డి–రోహిత వివాహానికి వెళ్తూ ఆయన ఫయాజ్‌భాషా ఇంటికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పట్టణ మైనార్టీ నాయకులు ఇద్దరినీ శాలువాలతో, పూలహారాలతో సత్కరించారు.

కుష్టు చికిత్స సులభతరం



కుష్టుపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించగలిగితే చికిత్స సులభతరం అవుతుందని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్ర అన్నారు. గురువారం మండలంలోని కసాపురంలో కుష్టువ్యాధిని గుర్తించే క్రమంలో భాగంగా ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శరీరంపై ఎవరికైనా స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని వైద్య సిబ్బంది సూచించారు. అనుమానిత కేసులను గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ అనంతరం ఉచితంగా ఎంటీడీ మందులు పంపిణీ చేస్తామన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

గుంతకల్లుటౌన్: భారత స్వాతంత్ర్య పోరాటంలో అసువులు బాసిన యోధులకు బీజేపీ నాయకులు నివాళులర్పించారు. గురువారం సాయంత్రం అఖండ సంకల్ప దివస్ కార్యక్రమంలో భాగంగా ఇల్లూరు భవన్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్, నాయకులు మహేష్, విజయలక్ష్మి, నారాయణరెడ్డి, సతీష్, పాండు, బిందు, పరిమళ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై దృష్టి



పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: పశువుల ఆరోగ్యంపైన రైతులు ప్రత్యేక దృష్టిని సారించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ టీవీ సుధాకర్ సూచించారు. పశువులకు వ్యాపించే గర్భకోశ వ్యాధులను గుర్తించి వాటికి చికిత్సను అందించే క్రమంలో భాగంగా గురువారం మండలంలోని కసాపురంలో పశుసంవర్ధక శాఖ పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన ఎదకురాని పశువులను, కట్టని పశువులను గుర్తించి చికిత్స అందజేశారు. లింగ నిర్ధారిత వీర్యంపై రైతులకు అవగాహన కల్పించడమే కాకుండా, వాటి ప్రాముఖ్యతను వివరించారు.

చంద్రబాబు నమ్మించి నట్టేట ముంచాడు

యల్లనూరు: ప్రజలను చంద్రబాబు నమ్మించి నట్టేట ముంచాడని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివశంకర్ మండిపడ్డారు. గురువారం మండలంలోని బొప్పేపల్లి, కూచివారిపల్లి, బుక్కాపురం,ఆరవేడు, కొడవండ్లపల్లి తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలసి ఆయా గ్రామాల్లో పర్యటించి చంద్రబాబు పాలనలో అవకతవకలు, కుంటుపడుతున్న అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణునారాయణ, మండల మాజీ కన్వీనరు వెంకటేష్‌నాయుడు, బొప్పేపల్లి సుబ్బిరెడ్డి, చింతకాయమంద నాగరంగయ్య, బుక్కాపురం రామాంజినేయులు, ప్రతాప్, చింతలపల్లి శ్రీనివాసులు, ఓటుల్‌రెడ్డి, మనోహర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆర్డీటీ సేవలు పునరుద్ధరించాలి

గుత్తి రూరల్: పేదలకు సేవలందిస్తున్న ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యూవల్ చేసి సేవలను పునరుద్ధరించాలని ఆ సంస్థ అభిమాన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ఆర్డీటీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. అంతకు ముందు పట్టణంలోని గాంధీచౌక్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంజనప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు వన్నెల వీరాంజనేయులు, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు మాట్లాడుతూ ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌ను కేంద్ర ప్రభుత్వం నిలిపివేయడం సరైన పద్ధతి కాదన్నారు. అనంతరం డీటీ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అంజలి, ఆర్డీటీ పాఠశాల ఉపాధ్యాయులు రంగయ్య, రామకృష్ణ, ఏపీ ఎంఆర్‌పీఎస్ నాయకులు అడవి రాముడు, గద్దల రామాంజి పాల్గొన్నారు.



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజా సమస్యలే ప్రధాన అంజెడాగా పోరాటం

గుంతకల్లు: ప్రజా సమస్యలే ప్రధాన అంజెడాగా ఉద్యమాలు చేపడతామని పట్టణ సీపీఐ నాయకులు స్పష్టం చేశారు. ఈ నెల 9, 10న అనంతపురంలో జిల్లా మహసభలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మహసభల్లో సీపీఐ జిల్లా కమిటీ ఎంపిక చేయగా అందులో గుంతకల్లుకు చెందిన పలువురు సీపీఐ నాయకులకు చోటు దక్కింది. జిల్లా కార్యవర్గ సభ్యులుగా బీ.గోవిందు, ఎం.వీరభద్రస్వామి, కౌన్సిల్ సభ్యులుగా బి.మహేష్, ఎస్ గోపీనాథ్, ఎస్‌ఎండీ గౌస్, రాముడాయల్‌ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గుంతకల్లు నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని, అధికారులపై ఒత్తిడి తీసుకురావడానికి భవిష్యత్ కార్యచరణ రూపొందిస్తామన్నారు. వజ్రకరూరు మండలం రాగులపాడు వద్ద తూములు ఏర్పాటు చేసి, పిల్ల కాల్వల ద్వారా నియోజకవర్గంలోని అన్ని చెరువులకు హంద్రీనీవా జలాలతో నింపాలన్నారు. గుంతకల్లులోని కసాపురం రైల్వే బ్రిడ్జి విస్తరణ, ధర్మవరం గేట్ వద్ద ఆర్‌యూబీ, బళ్లారి చౌరస్తా వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టడం తదితర డిమాండ్ల సాధనకు కృషి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

విద్యార్థులకు నోటు పుస్తకాల వితరణ



నోటు పుస్తకాలు అందుకున్న డిగ్రీ విద్యార్థులతో రోటరీ క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం తాడిపత్రి రోటరీ క్లబ్ సభ్యులు ఉచితంగా నోటు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కిశోర్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక సేవా భావాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ కార్యవర్గ సభ్యులు జోసఫ్ రెడ్డి, మద్దిలేటి, షాకీర్, మురుగన్ బాల సుబ్రమణ్యం, రమేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయలక్ష్మి, అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



గుత్తి ఆర్ఎస్‌లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న రైల్వే కార్మికులు

గుత్తి: ప్రతి ఒంటిపై జాతీయ జెండా ఎగరాలని గుత్తి డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ పిలుపునిచ్చారు. గుత్తి ఆర్ఎస్‌లో రైల్వే డీజిల్‌షెడ్ కార్మికుల ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై రైల్వే అధికారులు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద నుంచి గాంధీ సర్కిల్ వరకూ ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ సభ్యుడు విజయ భాస్కర్, స్టేషన్ మాస్టర్ సురేష్, సుధీర్, ఏఎస్‌ఐ కృష్ణ, ఏడీఎంఈ సుంకన్న, హెల్త్ యూనిట్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

నైపుణ్యాలుంటే ఉద్యోగాలు పుష్కలం

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువుతో పాటు మంచి నైపుణ్యాలు కలిగి ఉంటే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు పుష్కలంగా ఉన్నాయని జెడ్‌ఎస్ అకాడమీ యూనివర్స్ లింగో ఏఐ లిమిటెడ్ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ రూహీబాను అన్నారు. గురువారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ) ఏఐ అండ్ ఎంఎల్ విభాగాలు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్‌తో కలసి కెరీర్ అవకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్‌ఎస్ అకాటమీ యూనివర్స్ లింగో ఏఐ ఆమె మాట్లాడుతూ విద్యార్థులు టెక్నాలజీకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఏఐ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చార్టర్డ్ ఇంజినీర్ పక్రుద్దీన్ మహమ్మద్, ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రంజిత్‌రెడ్డి, డాక్టర్ చిత్ర లింగప్ప, డాక్టర్ వీర ప్రకాష్, డాక్టర్ భార్గవరెడ్డి, డాక్టర్ అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



రూహిబానును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుత్తిలో చైన్ స్నాచింగ్ కలకలం

గుత్తి: పట్టణంలో చైన్ స్నాచింగ్ కలకలం రేగింది. అయితే విషయం బట్టబయలైన గంట వ్యవధిలోనే చైన్ ఆమె మెడలో కనిపించడం విశేషం. వివరాలు... గుత్తిలోని కర్నూలు రోడ్డులో ఒంటరిగా నివాసముంటున్న వృద్ధురాలు అనసూయమ్మ గురువారం మధ్యాహ్నం 2 గంటల ఇంట్లో నిద్రిస్తుండగా ఓ గుర్తు తెలియని ముసుగు వ్యక్తి లోపలకు ప్రవేశించి ఆమె మెడలోని 5 తులాల బంగారు చైన్ లాక్కొని ఉడాయించాడు. ఆ సమయంలో ఉలిక్కిపడి లేచిన ఆమె వెంటనే మిద్దపై నుంచి కిందకు వస్తూ దొంగ దొంగ అంటూ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు పోగయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐలు సురేష్, గౌతమ్, పోలీసులు కూడా అక్కడకు ఘటనపై ఆరా తీశారు. ముసుగు వ్యక్తి తన మెడలోని బంగారు చైన్‌ను అపహరించాడంటూ వృద్ధురాలు వాపోయింది. దీంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఓ గంట తర్వాత దొంగలించబడిన చైన్ ఆమె మెడలో ప్రత్యక్షం కావడంతో స్థానికులు అవాక్కయ్యారు. వృద్ధాప్యం కారణంగా ఇంట్లోనే బంగారు చైన్ పెట్టి మరిచిపోయి చోరీ అయినట్లుగా భ్రమించి ఉంటుందని పోలీసులు వెల్లడించారు. కాగా, ఈ ఘటనపై పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు.



ఘటనను పోలీసులకు వివరిస్తున్న బాధితురాలు

రైల్లో ప్రయాణికురాలి మృతి

గుత్తి: స్థానిక రైల్వే జీఆర్‌పీ పరిధిలో బుధవారం అర్ధరాత్రి కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికురాలు వెంకటలక్ష్మి(46) ఆకస్మికంగా మృతి చెందింది. హైదరాబాద్‌కు చెందిన రామలింగేశ్వరరావు, వెంకటలక్ష్మి దంపతులు మైసూరుకు వెళ్లేందుకు కాచిగూడ రైల్లోని డీ-3 ఏసీ కోచ్‌లో బయలుదేరారు. అయితే మార్గ మధ్యంలో ఛాతీలో నొప్పి రావడంతో ఆమె ఒక్కసారిగా కుప్ప కూలారు. జీఆర్‌పీ సిబ్బంది సాయంతో ఆమెను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

గుంతకల్లుటౌన్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్ర బాబు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఎస్ఎస్‌జీఎస్ జూనియర్ కాలేజీ నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు వంశీ, సందీప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి కంపు కొడుతోంది ..



ఆందోళన చేపట్టిన సీపీఐ నాయకులు

తాడిపత్రిటౌన్: పట్టణంలో ఎక్కడ చూసినా మురుగు వాసనతో కంపు కొడుతోందని సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి ధ్వజమెత్తారు. గురువారం సీపీఐ నాయకులు పట్టణంలోని 11 వార్డులో పర్యటించారు. వారు మాట్లాడుతూ నివాసాల వద్ద నెలకొన్న మురుగునీటితో తాడిపత్రి పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు పన్నుల వసూళ్లలో చూపిన శ్రద్ధ డ్రైనేజీల శుభ్రతపై కూడా చూపాలన్నారు. మురుగు కారణంగా పలు కాలనీల్లో ప్రజలు విషజ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారన్నారు. పట్టణంలో మురుగు సమస్యను పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, శీనా, అబ్రహం, రంగస్వామి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేడు స్వాతంత్ర్య దినోత్సవం

శింగనమల: బుక్కరాయసముద్రంలోని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్వాతంత్ర్య దిన వేడుకల ను శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు గురువారం తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ పాల్గొంటారని, నియోజకవర్గంలోని నాయకులు, జిల్లా అనుబంధ విభాగాల నాయకులు, కార్యదర్శులు, మండల కన్వీనర్లు, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కార్యకర్తలు అభిమానులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

యాడికి: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని ఎంపీడీఓ వీర్రాజు ఆదేశించారు. గురువారం మండలంలోని రాయలచెరువులో ఉన్న నంబర్ 1, నంబర్ 2 సచివాలయాలను ఎంపీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేసి, పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామ న్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

గుంతకల్లు: పట్టణంలోని వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మంజునాథ్, కరస్పాండెంట్లు ఓంకార్, గురులు విద్యార్థులకు కృష్ణాష్టమి పండగ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా రాధకృష్ణుల వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. అదేవిధంగా ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, సీఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కృష్ణాష్టమి వేడుకలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారి పక్కన వెలసిన శ్రీకృష్ణ మందిరంలో ఈ నెల 16న కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఎల్లమ్మ అనే మహిళ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మ బిక్షాటన చేసుకుంటూ కొన్ని నెలలుగా రజాపురం గ్రామ శివార్లలో తిరుగుతూ ఉండేది. ఈ నెల 3న రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఎల్లమ్మను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎల్లమ్మ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

యాడికి: మండలంలోని తూట్రాళ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు పుట్లూరు వెంకటనారాయణరెడ్డి అనారోగ్యంతో గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు.సమాచారం అందుకున్న సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు తూట్రాళ్లపల్లికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుమారుడు, 3వ వార్డు సభ్యుడు లక్ష్మిరెడ్డి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.



వెంకటనారాయణ రెడ్డి (ఫైల్)